





## కరుణామయుడు

గిరిరాజు సంతోషబాబు

శేఖర్ రిక్షా దిగాడు. జేబులన్నీ తడుము కొని రూపాయిన్నర పైకి తీశాడు. “అరెరె! జేబులో రూపాయిన్నరే వుంది. రిక్షాను రెండు రూపాయలకు బేరమాడాను. ఇవ్వుడెలా? ఇక్కడ తెలిసిన వారెవ్వరూ లేరే!” శేఖర్ కంగారుపడ్డాడు. “ఇదంతా మా ఆవిడ వల్ల జరిగింది. నాతో చెప్ప కుండానే నా పాంటులోని డబ్బులను కాయ గూరలకో, దేనికో వాడివుంటుంది.” ఇప్పు డెలా? రెండు రూపాయలున్నాయని బేర మాడాను. ఏంచేసేది? ఛి, ఛీ ఈ ఆడ వాళ్ళెప్పుడూ ఇంతే” కసితీరా తిట్టు కొన్నాడు.

“తొందరగా ఇయ్యండి బాబు. టేషన్‌కు ఎల్లాల బండివత్తది.” తొందర చేసేడు రిక్షావాడు. చూస్తే ఎవ్వడో మంచి వాడుగా ఉన్నాడని శేఖర్ తన గోడంతా చెప్పి “నీవు ఎక్కడన్నా కనిపిస్తే. నీ డబ్బు నీకిస్తాలే. అన్నట్లు నీ పేరేమి?” అని అడిగాడు. “భలేవారండి డబ్బుల్లే కుండా బండెందు కెక్కారు. నా డబ్బులు నాకు పారెయ్యండి. మీలా ఏషాలేసేవారిని నేనింతదాకా సూళ్ళేదు” అని రిక్షావా డనే సరికి “భగవంతుడా! వీడెవ్వడో ఘటికు డులా వున్నాడు, డబ్బు యివ్వకపోతే నాతో రిక్షా తొక్కిస్తాడేమో” అని లోలోపల అనుకున్నాడు.

అప్రయత్నంగా శేఖర్‌దృష్టి రోడ్డు ప్రక్కగా గీసిన ఏసుక్రీస్తు బొమ్మపై పడింది. అందరిలా పదో పరకో వేద్దామని జేబులు తడుముకొని తను యిప్పు డనుభ విస్తున్న పరిస్థితికి “అయ్యో” అను కున్నాడు. వెంటనే ఒక ఆలోచన బుర్రలో తళుక్కుమంది. తమదగ్గరున్న రూపాయి నోటును తీసి ఆ బొమ్మపై విసిరాడు. (పెద్ద కళారాధకుడుగా పోజు కొడుతూ) అక్కడ పడివున్న చిల్లరలో రూపాయి న్నర తీసుకొని తన దగ్గరగల అర్ధ రూపాయికలిపి రిక్షావాడికి రెండు రూపాయ లిచ్చేశాడు. ఆ రిక్షా వాడేమనుకున్నాడో ఏమో తిరిగి అర్ధ రూపాయిని ఆ బొమ్మ పైకి విసిరాడు.

దీనన్నంతా చూసి తను రిక్షావాడికన్నా కళారాధనలో ఒక మెట్టు క్రిందే వున్నాను అని తలచుకొని సిగ్గులో తల క్రిందకు వాల్చాడు శేఖర్. ★

## కుక్క



అల్లం రాజయ్య

రంగయ్య షావుకారి భార్యకు చెముడు. అరిచి గీ పెడితేగాని ఆవిడకు వినిపిం చేది కాదు. రంగయ్యది చిన్న దుకాణం కావడంవల్ల రంగయ్య భార్య సత్తెమ్మ యింటా బయట సహధర్మచారిణిగా వుండిపోక తప్పలేదు. మరంచేత రంగ య్యకు అరవడం బాగా అలవాటయింది. పల్లెటూల్లో సవాలక్ష కారణాలవలన బేరం దెబ్బతిని బొగ్గుగని ఏరియాకు తరలిరాక తప్పలేదు.

రంగయ్య అరవడంవల్ల పూర్వాపరాలు తెలియని కొత్త కష్టమర్లు కొంత యిబ్బంది పడిపోయారు. రంగయ్యది అసలే బొంగురు గొంతు. అందులో కొంత అసహనం కలి పితే రంగయ్య మాట్లాడితే కుక్క అరిచి నట్టుగా వుండేది. మరంచేత కార్మికులు రంగయ్యను “కుక్క” అని ముద్దుగా పిలుచుకోసాగారు.

రంగయ్య దినదినాభి వృద్ధిగాంచి కొంత యెదిగిపోయాడు. చిల్లరకొట్టు కిరాణా షాపయ్యింది. సత్తెమ్మ స్థానంలో నలుగురు నౌఖర్లు వచ్చారు. కాని కష్టమర్లు రంగయ్యను “కుక్క” అనే పిలువ సాగేరు. అది వియ్యంకుడొకడు పైంట వుటు చేయడంవలన రంగయ్య నామర్దా ఫీలయ్యి చాలా రాత్రుల్లు నిద్రలేక గడి పాడు.

వచ్చిన వాళ్ళందరికి తనను “రంగయ్య సేఠ్” అని పిలువుమని మరీమరీ చెప్పినా ఫలితం దక్కలేదు. నిక్‌నేమ్ పోవడం ఎట్లాగో తోచలేదు. ఒక రాజకీయ ఆప్త మిత్రుడు ఉచితంగా ఓ సలహా యిచ్చేడు.

ఫలితంగా తెల్లారి రెండు పులిబొమ్మలు తెచ్చి షాపుముందర బెట్టాడు. ఈసారి “పులి రంగయ్య” అంటారని ఆప్తమిత్రుడి అంచనా.. కష్టమర్లు ఏమనుకుంటున్నారో వినాలనే కుతూహలంతో మారువేషంలో తిరిగే పూర్వకాలపు రాజులాగా సారా సెంటర్లో చేరిపోయాడు రంగయ్య....

“కుక్క పులి రంగయ్య దుకాణంలో బియ్యం బస్తా నూటయాభై....” అన్నా డొకడు.

“ఓహో పులి దుకాణ మెక్కడ?”

రంగయ్య మరింక వినదలచుకోలేదు.

మధ్యలో కొడుకు పెళ్ళి హడావిడిలో బేరం తగ్గడం గమనించలేదు.

తీరా కొన్నాళ్ళకి బేరం సంగతి బేరీజు వేసుకుంటే తేలిందేమంటే పక్క వీధిలో రాజకీయ ఆప్తమిత్రుడు తన బామ్మర్దితో దుకాణం తెరిపించి తనూ పులి బొమ్మలు పెట్టించాడని.

ఆ రాత్రే పులి బొమ్మలు తీయించాడు.

మళ్ళీ కౌంటర్‌లో కూర్చుండి కుక్క రంగయ్య సేఠ్‌కుక్కలా మొరుగసాగాడు.

బేరం పుంజుకుంది. ●